# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-05-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలపై విచారణకు ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసింది.
2. తెలంగాణ రాష్ట్రాన్ని రానున్న 4ఏళ్లలో ఐటీ రంగంలో విస్తృత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.
3. తెలంగాణ సంక్షిప్త పదాన్ని టీఎస్‌కు బదులు టీజీగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.
4. వేసవి సెలవుల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ లోని తిరుమలలో భక్తులు రద్దీ పెరిగింది.
5. ప్రపంచ పురావస్తు ప్రదర్శనశాలల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.

===========================

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు ముందు, తర్వాత జరిగిన ఘర్షణలపై విచారణకు ప్రత్యేక విచారణ బృందం-సిట్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఐజీ వినీత్ బ్రిజలాల్ నేతృత్వంలో 13 మంది సభ్యులతో ప్రత్యేక బృందాన్ని నియమించారు. పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో జరిగిన హింసాత్మక ఘటనలపై విచారించి నివేదిక ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించనుంది. సంబంధిత నివేదికను రెండురోజుల్లో కేంద్ర ఎన్ని కల సంఘానికి పంపిస్తామని డీజీపీ తెలిపారు.

---------------------------

తెలంగాణ రాష్ట్రాన్ని రానున్న 4ఏళ్లలో ఐటీ రంగంలో విస్తృత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్ లో నిన్న ఐజీబీసీ గ్రీన్ ప్రాపర్టీ షోను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పెట్టుబడులు తెచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సులభతర వాణిజ్య విధానానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పెట్టుబడిదారులకు, నిర్మాణ సంస్థలు, స్థిరాస్తి రంగానికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని మంత్రి వెల్లడించారు.

---------------------------

తెలంగాణ సంక్షిప్త పదాన్ని టీఎస్‌కు బదులు టీజీగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. జీవోలు, నోటిఫికేషన్లు, నివేదికలు, అధికారిక పత్రాలలో ఇకపై టీజీగా ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు, సంస్థలు, స్వయంప్రతిపత్తి విభాగాలన్నీ దీనిని

పాటించాలని ఆదేశించారు. అలాగే జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి దృశ్యమాధ్యమం ద్వారా ధాన్యం సేకరణపై సమీక్ష నిర్వహించారు. వర్షకాలం రానున్నందున ధాన్యం సేకరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు నష్టపోకుండా ఉండేలా, తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో క్షయ వ్యాధి వ్యాప్తి, కేసుల నియంత్రణకు బీసీజీ టీకా పంపిణీ కార్యక్రమం ప్రారంభం కాగా.. అల్లూరి సీతారామరాజు, అన్నమయ్య, చిత్తూరు, గుంటూరు, కృష్ణా, నంద్యాల, పల్నాడు, నెల్లూరు, శ్రీ సత్యసాయి, విశాఖపట్నం, విజయనగరం, కడప జిల్లాల్లో గడిచిన 2 రోజుల్లో 2 లక్షల మందికి బీసీజీ టీకా వేసినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ టీకా పంపిణీ 12 వారాల వరకు జరగనుందని పేర్కొంది.

---------------------------

బ్రిటిష్ కాలం నాటి నేర న్యాయవ్యవస్థ స్థానంలో నూతనంగా రూపొందించిన మూడు నేర చట్టాలు ఈ ఏడాది జులై 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. ఇప్పటివరకు అమల్లో ఉన్న భారతీయ శిక్షాస్మృతి, నేరశిక్షా స్మృతి, భారత సాక్షాధార చట్టం 1872 స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరికత సురక్ష సంహిత, భారతీయ సాక్షా చట్టాలను వర్తింపజేయనున్నారు. ఆమోదం అనంతరం గత ఏడాది డిసెంబర్ 25న రాష్ట్రపతి సంతకంతో అవి చట్టం దాల్చాయి. ఈ నూతన నేరచట్టాల ఆవశ్యకత గురించి తెలియజేస్తూ విశ్రాంత ఐపీఎస్ అధికారి ఈ. దామోదర్‌తో ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ప్రపంచ పురావస్తు ప్రదర్శనశాలల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. పురావస్తు ప్రదర్శనశాలలు దేశాల సాంస్కృతిక, వారసత్వ సంపదలను కాపాడి భావితరాలకు అపురూపమైన విజ్ఞానాన్ని అందించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. పురావస్తు ప్రదర్శన శాలలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, వాటిని మరింత ప్రోత్సహించే ఆవశ్యకతను తెలియచేసేందుకు 1977 నుంచి ప్రతీఏటా మే 18వ తేదీన ప్రపంచ పురావస్తు ప్రదర్శనశాలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

తెలంగాణ ప్రభుత్వ వార్షిక లక్ష్యాలకు అనుగుణంగా ఆదాయం పెంచేందుకు అధికారులు సమగ్ర ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకోసం శాఖల మధ్య సమన్వయం ఉండాలని, పన్నుల ఎగవేత విషయంలో చర్యలు చేపట్టాలని అన్నారు. రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం వచ్చే వాణిజ్య పన్నులు, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, మైనింగ్ విభాగాల అధికారులతో ముఖ్యమంత్రి నిన్న హైదరాబాద్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంచనా మేరకు స్థూల,వస్తు సేవల పన్ను-జీఎస్టీ సాధించడంలో క్షేత్రస్థాయి పరిశీలనలు, ఆడిటింగ్‌లను జరపాలన్నారు. అక్రమ మద్యం రవాణాను అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం ఏడాదికోసారి భూముల మార్కెట్ విలువను సవరించాల్సి ఉంటుందన్న ముఖ్యమంత్రి ఆ క్రమంలో ధరల సవరణకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

---

ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వ కార్యాలయాల్లో చేపట్టిన ఈ-ఆఫీస్ ఆధునీకరణ ప్రక్రియను వాయిదా వేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. గ్రామ, వార్డు సచివాలయాలకు ఈ-ఆఫీస్ ను విస్తరించడంపై ఫిర్యాదుల అందటంతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనా ఆధునీకరణ ప్రక్రియను నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు.

---

తెలంగాణలోని వరంగల్-ఖమ్మం-నల్గొండ శాసనమండలి నియోజకవర్గ పరిధిలో ఉప ఎన్నిక జరగనున్నందున 144 సెక్షన్ అమలులో ఉందని ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి వెంకన్న తెలిపారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ ఆర్డీవో కార్యాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

---

జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం -జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఏపీఈఏపీ సెట్-2024 నిన్న ఆంధ్రప్రదేశ్‌లో, హైదరాబాద్‌లోనూ ప్రశాంతంగా జరిగిందని సెట్ ఛైర్మన్, ఉపకులపతి జి.వి.ఆర్.ప్రసాదరాజు తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల పరీక్షకు శుక్రవారం ఉదయం 20 వేల 226మంది హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 20 వేల 654 మంది పరీక్షకు హాజరైనట్లు వివరించారు. మొత్తంగా 91.62 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

---

వేసవి సెలవుల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ లోని తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. దీంతో భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు 24 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం తెలిపింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్లు భక్తులతో నిండిపోయి.. 3 కిలోమీటర్ల మేర భక్తులు దర్శనానికి వేచి ఉన్నారు. క్యూలైన్‌లలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అధికారులు తాగునీరు, అల్పాహారం అందిస్తున్నారు.

---

హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాలపై జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రాస్ హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిలోని 6 జోన్లకు సంబంధించిన కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని లోతట్టు ప్రాంతాలు, ట్రాఫిక్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాల కారణంగా రహదారులపై పేరుకుపోతున్న బురదను శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మరో 5 రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

---

ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాబోయే నాలుగు రోజులపాటు ఆంధ్రప్రదేశ్‌లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓమోస్తరు వర్షాలు పడతాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు

అల్లూరి సీతారామరాజు, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

మరోవైపు... తెలంగాణాలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు బయటకు రావొద్దని వాతావరణ శాఖ సూచించింది.

======================